నీకిదేం పోయేకాలం? చెప్పింది బుద్ధిగా విను!''.. కూతురి మీద కయ్యిమని అంతెత్తున లేచింది తల్లి.

''మీ పరువుకు ఎలాంటి ముప్పు జరగదులే! మీకు దూరంగా నా బతుకేదో నేను ఒంటరిగా బతకగలను''.. రోషంగా తల్లికి సమాధానమిచ్చిందా అమ్మాయి.

''నువ్వు తల్లివి కావాలనుకుంటే.. ఈ తల్లి ఆయుష్షు ముగుస్తుంది. ఏదో ఒకటి తేల్చుకో.. జాగ్రత్త!''.. కళ్లెర్ర చేసిందావిడ.

''చూడమ్మాయ్! బాగా ఆలోచించు!''.. కలుగజేసుకుంది డాక్టర్ కాత్యాయిని.

ఆ అమ్మాయి దగ్గర నుంచి ఎలాంటి సమాధానం రాకపోయేసరికి తిరిగి పెదవి విప్పింది డాక్టర్.

''చిన్నపిల్లవు. పెళ్లి కాకుండానే తల్లి కావడం అంత మంచిది కాదు. నీలాగే మోసపోయిన అమ్మాయిలు ఎంతోమంది ఉన్నారు. పాపాన్ని తుడిచేసుకుని నిర్భయంగా బతుకుతున్నారు. మంచి, చెడు ఆలోచించాకే మీ అమ్మ ఈ నిర్ణయానికి వచ్చి ఉంటుంది! కన్నతల్లి మాట వినడంలో అంతా మంచే జరుగుతుంది. చెడు జరగదు కదా! నువ్విలా మొండి పట్టు పట్టడంలో అర్థం లేదు''.. ఆ అమ్మాయికి హితబోధ చేసింది డాక్టర్ కాత్యాయిని.

ఆ అమ్మాయి తలొంచుకుని మౌనంగా ఉండిపోయింది.

''డాక్టరమ్మా! మీ పని మీరు కానివ్వండి. డబ్బు గురించి ఆలోచించకండి. నాకు కావాల్సింది నా కూతురు క్షేమం. కాకపోతే మూడో కంటికి ఈ విషయం తెలియనివ్వకపోతే చాలు!''.

ఆ తల్లి తిరిగి రెండు చేతులూ జోడిస్తూ ప్రాధేయపడింది. ఆ అమ్మాయి పేచీ పెట్టలేదు. ఒక్క మాట కూడా ఎదురు చెప్పలేదు.

''నా దగ్గరికి ఎవరు వచ్చినా నమ్మకంతోనే వస్తారు. ఈ విషయం మన ముగ్గురి మధ్య రహస్యంగానే ఉంటుంది. భయపడకండి. నిశ్చింతగా ఉండండి!'' అంటూ భరోసా ఇచ్చింది డాక్టర్.

* * *

''చాలా ఆతృతగా ఉందండీ!'' అన్నది కాత్యాయిని, కాస్త టెన్షన్‌కు గురవుతూ.

''దానికింత కంగారెందుకు?''.

''పుట్టబోయేది అబ్బాయో.. అమ్మాయో తెలిసేదాకా నాకిలాగే ఉంటుందండీ!''.

''ఎవరైతే ఏంటీ? బేబీ అయినా, బాబు అయినా మన రక్తం పంచుకొని పుట్టబోతున్న శిశువు. చిరునవ్వుతో స్వాగతిద్దాం!''.

''అమ్మో? ఈ ఉత్కంఠ భరించడం నా వల్ల కావడం లేదండీ! నాకెందుకో బాబైతే బాగుండనిపిస్తున్నది''.. తన మనసులోని మాట బయటపెట్టింది.

''అలాంటప్పుడు ఆ రేడియాలజిస్ట్ నిన్న స్కానింగ్ చేసినప్పుడే జెండర్ తెలుసుకోవాల్సింది. ఈ రోజు దాకా ఆగడం దేనికి? టెన్షన్‌కు గురికావడం దేనికి?'' అడిగాడతను.

''నిన్న మంచిరోజు కాదని ఆ విషయం దాచిపెట్టమని చెప్పాను. ఇంకొక ఐదు నిమిషాల్లో శుభ ఘడియ రాబోతుంది. ఆ సమయానికే కాల్ చేయమని ఆల్రెడీ చెప్పేశాను'' బదులిచ్చింది కాత్యాయిని.

ఇద్దరి మధ్య కాసేపు నిశ్శబ్దం.

ఐదు నిమిషాలు కాస్తా.. ఐదు యుగాలై భారంగా కరిగిపోతుండగా ఫోన్ రింగ్ అయ్యింది.

ఉద్వేగంతో చేతిలో ఉన్న స్మార్ట్‌ఫోన్ గ్రీన్ బటన్ నొక్కింది కాత్యాయిని. అవతలి నుంచి..

''హాయ్! గుడ్ ఈవినింగ్ కాత్యా! నువ్వు కోరుకున్నట్టే రిజల్ట్స్ వచ్చాయి. కంగ్రాచ్యులేషన్స్! మగ శిశువుకు జన్మనివ్వబోతున్నావ్! బీ కూల్!''.. రేడియాలజిస్ట్ ఫ్రెండ్ శివగామిని గొంతు వినిపించింది.

''థాంక్యూ! శివా! థాంక్యూ వెరీమచ్!'' సంతోషంతో థ్యాంక్స్ చెప్పింది కాత్యాయిని.

''ఎంజాయ్! ఓకే.. బై!'' అంటూ ఫోన్‌పెట్టేసింది రేడియాలజిస్ట్ శివగామిని.

పక్కనే కూర్చుని ఉన్న భర్త వైపు చూస్తూ..

''హమ్మయ్య! బాబేనట!'' గాఢంగా ఊపిరి పీలుస్తూ భర్తకూ తీపికబురు అందించింది కాత్యాయిని.

''చూశావా! నువ్వు అనుకున్నవి అనుకున్నట్టే అన్నీ జరుగుతున్నాయి''.

''కావచ్చు. కానీ, మన చేతిలో ఏమీ ఉండదు కదండీ! పిల్లలు దేవుడిచ్చే బహుమతులు కదా!''.

''ఎనీ హౌ.. నీ ఆనందమే నా సంతోషం!''.

కులకర్ణి వాత్సల్యపు మాటలకు కాత్యాయిని ముఖం విప్పారింది. అనురాగాతిశయంతో భర్తను అల్లుకుపోయింది.

* * *

కొన్ని రోజులు గడిచాయి. తానొక డాక్టర్ అనే విషయం విస్మరించి కాత్యాయిని కళ్లు ధారాపాతంగా స్రవిస్తున్నాయి.. ఒక సాధారణ బాలింతరాలిలా.

ఆమె ఈ విషయాన్ని జీర్ణించుకోలేక పోతున్నది.

వాస్తవం అదే కనుక తప్పదు. కాత్యాయినికి నెలలు నిండాక నార్మల్ డెలివరీ కాలేదు. అందుకని ఆమెకు సిజేరియన్ ఆపరేషన్ చేసి మగ శిశువును ఈ ప్రపంచానికి పరిచయం చేసింది సీనియర్ డాక్టర్ వేదవతి ప్రభ.

''సో సారీ.. కాత్యాయినీ! నీకు పుట్టిన శిశువు మెంటల్లీ రిటార్టెడ్‌గా పుట్టాడు!''..

విషయం చెప్పి ఆ గదిలో నుంచి వెళ్లిపోయింది డాక్టర్ వేదవతి ప్రభ.

అది వినగానే వేనవేల నీడిల్స్ ఒక్కసారిగా తన గుండెను గుచ్చినట్టు ఝల్లుమంది కాత్యాయినికి. చాలాసేపు షాక్‌లోనే ఉండిపోయింది.

'ఎందుకిలా జరిగింది?'.. చాలాసేపు తనలో తనే మదనపడింది.

''నాకే ఎందుకిలా జరిగిందండీ?''.. తిరిగి పైకి అనేసింది.. పక్కనే కూర్చున్న భర్తకు వినిపించేలా.

ఆమె ఆవేదనకు బదులుగా చాలా కూల్‌గా పెదవి విప్పాడు కులకర్ణి.

'నమస్తే తెలంగాణ, ముల్కనూరు ప్రజాగ్రంథాలయం' సంయుక్తంగా నిర్వహించిన 'కథల పోటీ-2022'లో రూ.2 వేల బహుమతి పొందిన కథ.

